నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 8-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:26 | సంచిక: 140 | పేజీలు: 4 | వెల: రూ.1/-

పాల ఎగుమతుల్లో భారత్ అగ్రగామి : గవర్నర్ తమిళిసై

హైదరాబాద్, జనవరి 7 : రాజేంద్రనగర్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలో అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్‌లో 110వ ఫౌండేషన్ కోర్సును రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రారంభించారు. వ్యవసాయ పరిశోధన సేవల 2 నెలల శిక్షణకు 25 రాష్ట్రాల నుంచి 135 యువ శాస్త్రవేత్తలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పాల ఎగుమతుల్లో భారత్ అగ్రగామిగా ఉంది అని తెలిపారు. దేశంలో పెద్ద ఎత్తున మొబైల్ వ్యాక్సినేషన్ కార్యక్రమం సాగుతుందన్నారు. అమెరికాలోని కొన్ని కంపెనీలు పశువుల్లో కృత్రిమ గర్భధారణ చేస్తున్నాయి. వ్యవసాయంలో మానవ వనరుల కొరత ఉంది. వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ సేవలు క్షేత్రస్థాయికి విస్తరింపజేయాలి. వ్యవసాయ విద్య, పరిశోధనలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు గవర్నర్. పరిశోధన ఆధారంగా పరిశ్రమల స్థాపన జరగాలని గవర్నర్ సూచించారు. ప్రతి రాష్ట్రం, ప్రాంతంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులున్నాయని తమిళిసై తెలిపారు. రెండో హరిత విప్లవం దిశగా యువ శాస్త్రవేత్తలు కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. రైతుల ఆదాయాలు రెట్టింపు కోసం ప్రతి శాస్త్రవేత్త కృషి చేయాలి. వ్యవసాయ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. మానసిక ఒత్తిళ్లు అధిగమించేందుకు యోగా శిక్షణ అలవరుచుకోవాలి అని గవర్నర్ సూచించారు

అన్ని పట్టణాల్లో ఐటీని విస్తరిస్తాం

- ఐదేళ్లలో తెలంగాణకు 12వేల పరిశ్రమలొచ్చాయి
- యువతకు ఉద్యోగాలకోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం
- వరంగల్ జౌళిపార్కులో పూర్తిస్థాయి పనులు ప్రారంభిస్తాం
- హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు పారిశ్రామిక కారిడార్‌గా తీర్చిదిద్దుతాం
- ఆధ్యాత్మిక కేంద్రంగా యాదాద్రి వర్ధిల్లుతుంది
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- వరంగల్‌లో ఐటీ గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి

వరంగల్, జనవరి7(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలోని అన్ని ప్రధాన, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఐటీ పరిశ్రమలను విస్తరిస్తామని, యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం వరంగల్‌లో మూడు ఐటీ కంపెనీలను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. నగరంలోని మడికొండలో సైయెంట్, టెక్ మహీంద్రా, ప్రాంగణాలను ప్రారంభించారు. దీంతోపాటు ఐటీ గ్లోబల్ డెలివరీ సెంటర్‌ను కూడా ఆరంభించారు. ఇప్పటికే ఆధునిక హంగులతో ఐదెకరాల్లో సైయెంట్ భవనాన్ని నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ కేంద్రంలో 600 నుంచి 700 మంది ఉద్యోగులతో సేవలు అందించేలా దీన్ని రూపొందించారు. ఇక టెక్ మహీంద్రాలో 100 వరకూ విధులు నిర్వర్తించవచ్చు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. అడిగిన వెంటనే పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన సైయెంట్ ఛైర్మన్ బీవీ మోహన్ రెడ్డి, టెక్ మహీంద్రా సీఈవో గుర్నానీకి ధన్యవాదాలు తెలిపారు. 2018 ఏడాదిలో ప్రపంచ ఆర్థిక వేదికలో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో టెక్ మహీంద్రా గుర్నానీని కలిశానని, హైదరాబాద్ తర్వాత మంచి వనరులు ఉన్న వరంగల్‌లో కంపెనీ ప్రారంభించాలని కోరానని అన్నారు. వెంటనే ఆయన అక్కడికక్కడే అంగీకరించారని, రెండేళ్లలో ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందని మంత్రి అన్నారు. వరంగల్ పట్టణంలో, ఇతర జిల్లాల్లో ఐటీ విస్తరణ అనేది కేవలం ఆరంభం మాత్రమేనని కేటీఆర్ పేర్కొన్నారు. సైయెంట్ కన్నా టెక్ మహీంద్రా దాదాపు 9రెట్లు పెద్ద దని, వరంగల్ యువతకు ఇక్కడే ఉద్యోగావకాశాలు దక్కనున్నాయని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ద్వితీయ శ్రేణి నగరాలైన వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మంలలో ఈ ఏడాదిలోనే ఐటీ రంగాన్ని విస్తరింపజేసే నిశ్చయంతో ఉన్నామని మంత్రి తెలిపారు. వరంగల్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మార్గాన్ని కూడా త్వరలో పూర్తి చేయనున్నామని, ఈ ప్రాంతాన్నంగిటిని పారిశ్రామిక కారిడార్‌గా మారుస్తామని కేటీఆర్ తెలిపారు. ఉప్పల్ వద్ద స్కైవే పూర్తయితే ఇక వరంగల్ నుంచి హైదరాబాద్‌కు కేవలం గంటన్నర వ్యవధిలో చేరుకోవచ్చునని, వరంగల్‌కు రింగ్ రోడ్డు నిర్మాణం కూడా జరుగుతోందని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్-వరంగల్ కారిడార్‌ను అద్భుతమైన పారిశ్రామిక కారిడార్‌గా రూపొందించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని కేటీఆర్ అన్నారు. యాదాద్రి క్షేత్రం కూడా ఈ కారిడార్‌లోనే రానుందని, పరకాలలో టెక్స్‌టైల్ పార్క్, స్టేషన్ ఘన్‌పూర్‌లో లెదర్ పార్కు, జనగామ ప్రాంతంలో కొత్త పరిశ్రమలకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఇలా హైదరాబాద్ నుంచి వరంగల్ వరకూ ఒక కారిడార్‌ను తయారు చేస్తున్నామన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టును త్వరలో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నామని, హెలీపోర్ట్ సర్వీసును కూడా ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని కేటీఆర్ అన్నారు. అదేవిధంగా యాదాద్రి ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుందని అన్నారు. ఇలా రాష్ట్రంలోని ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో తీరిగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు కేటీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా మడికొండలో ఐటి టవర్స్‌ను ప్రారభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కెటి రామారావు.

13న కేసీఆర్, జగన్ భేటీ

రాజధానిపై గందరగోళ సమయంలో ఆసక్తికర భేటీ - గోదావరి నీటి తరలింపు, ఇతర సమస్యలపై చర్చించే అవకాశం

హైదరాబాద్, జనవరి7(ఆర్ఎన్ఎ) : తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మరోసారి సమావేశమం అయ్యేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 13న హైదరాబాద్‌లో కేసీఆర్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు భేటీకానున్నారు. ప్రగతి భవన్ వేదికగా ఇరు రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించనున్నారు. విభజన చట్టం, ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రధానంగా ఫోకస్ పెట్టనున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు ఏపీ రాజధాని తరలింపునకు ముందు ఇద్దరు ముఖ్యమంత్రులు సమావేశంకానుండటం ఆసక్తి రేపుతోంది. భేటీలో విద్యుత్ ఉద్యోగుల విభజన సమస్యలు, శ్రీశైలానికి గోదావరి నీళ్ల తరలింపుపై ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. గోదావరి-కృష్ణా అనుసంధానంపై ఇప్పటికే ఇద్దరు సీఎంలు చర్చించారు.. కానీ ఎలాంటి క్లారిటీకి రాలేకపోయారు. ఈ సమావేశంలో ఇదే అంశంపై ఫోకస్ పెట్టబోతున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు రాజధానిపై రగడ జరుగుతున్న సమయంలోనే ఈ సమావేశం జరగనుండటంతో.. ఈ అంశం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇద్దరు ముఖ్యమంత్రులు ఇప్పటికే రెండు, మూడుసార్లు సమావేశమయ్యారు. విభజన చట్టం, పెండింగ్ సమస్యలపై చర్చించారు. కొన్నిటికి పరిష్కారం దొరికినా.. మరికొన్ని మాత్రం అలాగే పెండింగ్ ఉండిపోయాయి. దీంతో ఈ సమస్యల్ని వీలైనంత త్వరగా క్లియర్ చేయాలని భావిస్తున్నారు. మరి ఈ భేటీలో సీఎంలు ఎలాంటి చర్చలు జరుపుతారన్నది ఆసక్తికరంగా మారింది

భారత్ - అమెరికా మధ్య సహకారం

మరింత బలోపేతం కావాలి

- ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ..!

న్యూఢిల్లీ, జనవరి7(ఆర్ఎన్ఎ) : భారత్ - అమెరికా మధ్య సంబంధాలు పటిష్ఠమయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అన్నారు. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం మరింత బలోపేతం చేసే దిశగా కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ట్రంప్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు, అమెరికావాసులకు మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు ప్రధానమంత్రి కార్యాలయం మంగళవారం ఉదయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా జరిగిన ఫోన్ సంభాషణలో ఇరు దేశాల మధ్య సంబంధాల్లో సాధించిన పురోగతి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సంబంధాల్ని మరింత బలోపేతం చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ కూడా భారత ప్రజలకు న్యూ ఇయర్ విషెస్ చెప్పారు. గత కొన్ని సంవత్సరాలుగా భారత్ సాధిస్తున్న ప్రగతి పట్ల ట్రంప్ సంతోషం వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ చెప్పినట్లు ప్రధాని కార్యాలయం పేర్కొంది.

హత్యకు ప్రతీకారం..

- యాదాద్రి జిల్లా గొలనుకొండలో తీవ్ర ఉద్రిక్తత
- నిందితుడి ఇల్లు దహనం చేసిన మృతుని బంధువులు
- పోలీసుల అదుపులో గ్రామం

యాదాద్రి భువనగిరి, జనవరి7(ఆర్ఎన్ఎ) : జిల్లాలోని ఆలేరు మండలం గొలనుకొండలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గ్రామానికి చెందిన కన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి(38) దారుణ హత్యను నిరసిస్తూ గ్రామస్థులు, మృతుడి బంధువులు శుక్రవారం పరశరాములు అనే వ్యక్తి ఇంటిని తగులబెట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో గొలనుకొండ గ్రామానికి చెందిన కన్‌రెడ్డి వెంకటరెడ్డి భార్య భాగ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై జనగామకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం సిరిపురం రోడ్డు గుండా స్వగ్రామానికి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని దుండగులు వెంకటరెడ్డి వాహనాన్ని అటకాయించారు. దీంతో అతడు బైక్ దిగి పరుగులు తీయగా.. దుండగులు వెంబడించి కత్తితో పాశవికంగా అతడిని హత్య చేశారు. తన భర్తను చంపవద్దని భాగ్య ఎంతగా వేడుకున్నా కనికరించకుండా ఆమెపై కూడా దాడికి తెగబడటంతో స్వల్పగాయాలపాలైంది. ఈ నేపథ్యంలో గ్రామానికి చేరుకున్న భాగ్య... తమ గ్రామానికే చెందిన పరుశరాములు అనే వ్యక్తి తన భర్త మృతుడు వెంకటరెడ్డికి భార్య, ఇద్దరు వెంకటరెడ్డిని హతమార్చినట్లు గుర్తించింది. కూతుళ్లు ఉన్నారు. తన కళ్ల ముందే భర్తను పరశురాములు దారుణంగా కత్తితో చంపాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, వెంకటరెడ్డి బంధువులు మంగళవారం ఉదయం పరుశురాములు ఇంటిని తగులబెట్టారు. ఘటనతో బెంబేలెత్తిన పరుశరాములు కుటుంబ సభ్యులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో గొలనుకొండలో భారీగా పోలీసులను మోహరించారు. కాగా

సులేమానీ అంతిమయాత్రలో తొక్కిసలాట

35మంది మృతి

48మందికి గాయాలు

టెహ్రాన్, జనవరి7(ఆర్ఎన్ఎ) : అమెరికా డ్రోన్ దాడిలో హతమైన ఇరాన్ మేజర్ జనరల్ ఖాసిం సులేమానీ అంతిమ యాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. తొక్కిసలాటలో 35 మందికిపైగా మరణించారని, 48 మంది గాయపడ్డారని ఇరాన్ స్టేట్ టెలివిజన్ తెలిపింది. సులేమానీ స్వస్థలమైన కెర్మాన్‌లో మంగళవారం అంతిమ యాత్ర నిర్వహించగా.. లక్షలాది మంది జనం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోమవారం దేశరాజధాని టెహ్రాన్‌లో నిర్వహించిన సులేమానీ భౌతిక కాయ ఊరేగింపులో.. కనీసం పది లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు. లక్షలాది మంది జనం ఇరాన్ జాతీయ జెండాలు, సులేమానీ ఫొటోలతో కెర్మాన్ వీధుల్లోకి వచ్చిన దృశ్యాలను ఇరాన్ జాతీయ చానల్ ప్రసారం చేసింది. సులేమానీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని జనం నినాదాలు చేశారు. అమెరికా మద్దతు ఇస్తోన్న ప్రదేశాలను తగులబెడతామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ నాయకుడు హుస్సేన్ సలామీ.. భారీగా తరలివచ్చిన జనం ముందు ప్రమాణం చేశారు. కెర్మాన్‌లో నిర్వహించిన సులేమానీ అంతిమ యాత్రలో పాల్గొన్న వారంతా నలుపు దుస్తుల్లో నిరసన తెలిపారు. సులేమానీ హత్యకు తాము ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ప్రకటించారు. ఖుద్స్ ఫోర్స్ నూతన చీఫ్‌గా.. సులేమానీ స్థానంలో ఇస్మాయెల్ ఖానీని నియమించారు. సులేమానీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి తమ వద్ద 13 ప్లాన్లు ఉన్నాయని ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ అలీ షంఖానీ తెలిపారు. తాము చేపట్టబోయే బలహీన దాడే చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. అమెరికా బలగాలు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టి వెళ్లక పోతే.. వారి శరీర భాగాలను నిలువునా చీలుస్తామన్నారు. అమెరికా బలగాలను ఉగ్రవాదులుగా గుర్తించే బిల్లుకు ఇరాన్ పార్లమెంట్ మంగళవారం ఆమోదం తెలిపింది.

యువకుడు ఆత్మహత్య

హైదరాబాద్,జనవరి7 (ఆర్ ఎన్ ఎ):జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన హైదరాబాద్ నార్సింగిలో వెలుగు చూసింది. పోలీసులు వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నర్సాపూర్ పట్టణానికి చెందిన రంగినీధి మౌళీధర్(29)కు తల్లిదండ్రులు లేరు. హైదరాబాద్‌లోని పుప్పాలగూడ దుర్గానగర్‌లో ఉంటూ ఐటీ కంపెనీలో పని చేస్తున్నాడు. సోదరి శ్రావణి ఉద్యోగం చేస్తూ మాదాపూర్‌లోని మహిళా వసతిగృహంలో ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం మాదాపూర్‌లోనే ఉండే వారి బంధువొకరు ఆమె వద్దకు వచ్చి మౌళీధర్ ఫోన్‌లో అందుబాటులోకి రావడంలేదని చెప్పాడు. వారిద్దరూ పుప్పాలగూడ వచ్చి చూడగా మౌళీధర్ చనిపోయి ఉన్నాడు. నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ముఖానికి కవర్ చుట్టుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవంతిపోరా సెక్టార్‌లో ఎన్‌కౌంటర్

ఉగ్రవాదిని అంతమొందించిన ఆర్మీ

సైన్యంపై కుట్రలపై అప్రమత్తమైన బలగాలు

శ్రీనగర్,జనవరి7(ఆర్ఎన్ఎ): పుల్వామా జిల్లా అవంతిపోరా సెక్టార్‌లో భారత భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఓ ఉగ్రవాదిని బలగాలు మట్టుబెట్టాయి. హతమైన ఉగ్రవాది నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అవంతిపోరాలో ఎదురుకాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. డిసెంబర్ 31 రాత్రి నౌషెరా సెక్టార్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు భారత సైనికులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఇదిలావుంటే భారత సైన్యంపై ఉగ్రవాదులు మరో కుట్ర చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పుల్వామా ఉగ్రదాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం లక్ష్యంగా ఉగ్రవాదులు పేలుళ్లకు పాల్పడ్డారు. ఈసారి బాంబు దాడులు కాకుండా.. ఉగ్రవాదులు మరో రూట్‌ను ఎంచుకున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నారు. భారత సైన్యాన్ని చంపేందుకు ఉగ్రవాదులు భారీ కుట్రనే పన్నినట్లు తెలుస్తోంది. సైన్యం తీసుకునే ఆహారం, నీటిలో విషం కలపాలని ఉగ్రవాదులు ఎ÷-లాన్ చేసినట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి. దీంతో భారత భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండాలని నిఘా వర్గాలు హెచ్చరించాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన భారత ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణెళి గత వారం మీడియాతో మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాలు జరిగాయని చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాలను అరికట్టడంలో భారత సైన్యం విజయవంతం అయిందన్నారు. సరిహద్దులో భారత బలగాలు అప్రమత్తంగా ఉన్నారని ఆర్మీ చీఫ్ తెలిపారు. బోర్డర్‌లో రక్షణ విషయంలో కఠినంగా ఉంటామని ఆర్మీ చీఫ్ స్పష్టం చేశారు.

అమెరికాకు చెందిన లైనెక్స్ బయోసైన్స్ సంస్థ ప్రతినిధులతో సచివాలయంలో భేటీ అయిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.

హైకోర్టుకు 'దిశ' నిందితుల

రీ పోస్టుమార్టం రిపోర్టు

- షీల్డ్ కవర్‌లో సమర్పించిన ఢిల్లీ ఎయిమ్స్ బృందం
- 16న హైదరాబాద్ రానున్న జ్యుడీషియల్ కమిషన్

హైదరాబాద్, జనవరి7(ఆర్ఎన్ఎ) : దేశ వ్యాప్తంగా సంచలన సృష్టించిన దిశ హత్య కేసుకు సంబంధించి నిందితుల ఎన్‌కౌంటర్ జరిగి డిసెంబర్7తో నెల రోజులు పూర్తి కావొస్తుంది. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నిందితులకు సంబంధించిన రీ పోస్టుమార్టం రిపోర్టును ఢిల్లీ ఎయిమ్స్ బృందం షీల్డ్ కవర్‌లో మంగళవారం హైకోర్టుకు సమర్పించింది. మరోవైపు ఈ కేసుకు సంబంధించి సత్వర విచారణ చేయడానికి సుప్రీంకోర్టు నియమించిన జ్యుడీషియల్ కమిషన్ ఈ నెల 16న హైదరాబాద్‌కు రానుంది. కాగా షాద్‌నగర్ పోలీసులు వారం రోజుల్లో దిశ కేసులో తుది రిపోర్ట్‌ను మహబూబ్‌నగర్ ఫాస్ట్రాక్ కోర్టుకు సమర్పించనున్నారు. దిశ నిందితులు ఎన్‌కౌంటర్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రాచకొండ సీపీ మహేశ్ భగవత్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటైన సంగతి తెలిసిందే. దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై ఇప్పటికే అనేక సాక్ష్యాలను సేకరించిన సిట్ త్వరలోనే జ్యుడిషియల్ కమిషన్‌ను కలిసి సేకరించిన సాక్ష్యాలను సమర్పించనుంది. కాగా గతేడాది దిశపై అత్యాచారం, ఆపై హత్య చేసిన సంఘటన దేశ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దిశ కేసులో మహ్మద్ ఆరిఫ్, శివ,నవీన్, చెన్నకేశవులు ప్రధాన నిందితులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఘటన జరిగిన చటాన్‌పల్లి వద్ద సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్న క్రమంలో నలుగురు నిందితులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై దాడిచేసేందుకు యత్నం చేశారు. దాంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనల్లో నలుగురు మృగాళ్లు అక్కడిక్కడే హతమయ్యారు.

చరిత్రలో నేటినిజం



కం॥ ప్రాచీనపు భావములన్
పూచినపు దుష్పేథమున పరిశీలింపన్
కూర్చిన జ్ఞాన సుమమ్ము
యోచన లాసగిన గెలిలియో ను నుతింతున్॥

(జనవరి 8 శాస్త్రవేత్త గెలీలియో పుణ్యతిథి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

జేఎన్‌యూ ఘటనకు నిరసనగా ముంబాయిలో ఆందోళనలు

ముంబయి,జనవరి7(ఆర్ఎన్ఎ): ఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ) విద్యార్థులపై దుండగుల దాడిని నిరసిస్తూ దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో ఆందోళనలు కొనసాగాయి. గత ఆదివారం అర్ధరాత్రి ప్రారంభమైన ఆందోళనలు నేటికీ కొనసాగుతున్నాయి. వేలాది మంది ఆందోళనకారులు గేట్ వే ఆఫ్ ఇండియా వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లోని రహదారుల్లో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. స్థానికులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవ డంతో మంగళవారం పోలీసులు రంగంలోకి దిగారు. గేట్ వే ఆఫ్ ఇండియాను ఖాళీ చేయాలని నిరసనకారులకు సూచించారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో బలవంతంగా అక్కడి నుంచి ఆజాద్ మైదాన్‌కు తరలించారు. ఈ క్రమంలో ఒకింత ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆందోళన పర్యాటకులకు ఇబ్బందిగా మారిందని, ట్రాఫిక్ కూడా స్తంభించిపోయిందని పోలీసులు తెలిపారు. దీంతో ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని నిరసనకారులను కోరాం.. అయితే వారు వినిపించుకోకపోవడంతో ఆందోళనకారులను ఆజాద్ మైదాన్‌కు తరలించాం అని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంగ్రామ్‌సింగ్ నిషందర్ తెలిపారు.

జేఎన్‌యు దాడి కేసు...ఎబివిపికి క్లీన్‌చిట్

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): జేఎన్‌యూలో ముసుగు దుండగులు విద్యార్థులు, ఉపాధ్యాయులను చితకబాదిన ఘటనలో దర్యాప్తు సాగుతుండగానే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏబీవీపీకి క్లీన్‌చిట్ ఇస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడుతున్నాయి. బీజేపీ అనుబంధ సంస్థలకు హింసకు పాల్పడేంతటి శక్తిసామర్థ్యాలు లేవని చెప్పుకొచ్చారు. విద్యార్థుల భవితవ్యంతో చెలగాటం వద్దని కాంగ్రెస్, ఆప్‌లకు హితవు పలికారు. పరీక్షలకు హాజరయ్యే వారిని అడ్డుకోవద్దని జేఎన్‌యూ విద్యార్థులకు ఆయన విజ్ఞప్తి చేశారు. జేఎన్‌యూ ఘటనపై విచారణ సాగుతోందని త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని ఆయన చెప్పారు. మరోవైపు జేఎన్‌యూ దాడికి తమదే బాధ్యతని హిందూ రక్షా దళ్ ప్రకటించింది. జేఎన్‌యూ కమ్యూనిస్టులకు అడ్డాగా మారిందని, జాతి వ్యతిరేక..హిందూ వ్యతిరేక కార్యకలాపాలకు వారు పాల్పడుతున్నందునే తమ కార్యకర్తలు క్యాంపస్‌లోకి చొచ్చుకువచ్చి దాడులు జరిపారని ఆ సంస్థ నేత తోమర్ ఓ వీడియోలో వెల్లడించారు.

టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

ఎన్నికలే లక్ష్యంగా ప్రోత్సాహం

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): రాబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా గ్రామాల్లో టిఆర్ఎస్‌లో చేరికలు జోరుగా సాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా చేరికలు సాగినా, ఇప్పుడు పురపాలిక ఎన్నికల్లో ఈ చేరికల కారణంగా టిఆర్ఎస్ మరింత బలోపేతంగా కనిపిస్తోంది. చేరికలతో అత్యధిక సీట్లను గెల్చుకునేలా టిఆర్ఎస్ చేస్తున్న వ్యూహం ఫలిస్తోంది. టిఆర్ఎస్ పిలుపుతోఅన్ని పార్టీల నాయకులు తమ పార్టీలకు రాజీనామా చేసి గులాబీ గూటికి చేరుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో పట్టణాల్లో గులాబీ జెండా ఎగుర వేయాలని, ఆ దిశగా శ్రేణులు పనిచేయాలని నేతలు సూచించారు. పేదల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అహర్నిషలూ కృషి చేస్తున్నారని, రైతు బంధు, రైతు బీమా, ఆసరా, ఆహార భద్రత, కల్యాణలక్ష్మి వంటి పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. పట్టణాల్లో గులాబీ జెండా ఎగరాలని, తెలంగాణలో సుపరిపాలన ను అందిస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని పార్టీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ మోసపూరి మాటలను తెలంగాణ ప్రజలు నమ్మే రోజులు పోయాయన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని సర్కారు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై టీఆర్ చేరుతున్నారన్నారు. జిల్లా స్థాయిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న నాయకులు టీడీపీ,కాంగ్రెస్, బిజెపిలను వీడి టీఆర్ఎస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు.

నేటినిజం
బుధవారం 8-1-2020

ఇది..మరో వాస్తవం...

మన కేంద్ర ప్రభుత్వం దాదాపు ఐదేళ్లుగా 'స్వచ్ఛ భారత' పునర్ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు జరుపుతోంది. బహిరంగ స్థలాలలో మలమూత్ర విసర్జనకు స్వస్తి చెప్పడం, వీధులలోని చెత్తకుప్పలు తొలగించడం ఈ 'స్వచ్ఛ భారతం'లో రెండు ప్రధాన అంశాలు!- అని ప్రచారం జరిగింది, జరుగుతోంది! కానీ 'స్వచ్ఛత'ను ఎప్పటికప్పుడు భంగపరుస్తున్న మహావైపరీత్యం మద్యపానం!- అన్న కఠోర వాస్తవానికి మాత్రం ప్రచారం లేదు. ఆంగ్ల సంవత్సరాది కాని భారతీయ, జాతీయ సంవత్సరాదులు కాని శుభ సందర్భాలు! అందువల్ల 'సంవత్సరాది' సందర్భంగా కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పేవారు స్వరూప స్వభావాలు స్వచ్ఛంగా ఉండాలన్నది తరతరాల భారత జాతీయ నీతి! కానీ మద్యం తాగి మత్తెక్కి, ఊగుతూ, తూగుతూ, జోగుతూ ఉన్నవారు ఈ 'స్వచ్ఛత'కు దూరంగా ఉంటున్నారు! సూర్యోదయం కంటె ముందు నిద్రలేచి, స్నానం చేసి ప్రకృతికి, భూమికి కృతజ్ఞతలు చెప్పడం అనాదిగా మన జీవనం! అందువల్ల నూతన సంవత్సరాది రోజున అయినా ఈ పద్ధతి పాటించడం కనీస ధర్మం.. భూమి, ప్రకృతి సకల జనులకు మాత్రమే కాదు, సకల ప్రాణికోటికి జీవన అస్తిత్వాన్ని, అభ్యుదయాన్ని ప్రసాదిస్తుం డడం ప్రత్యక్ష అనుభవం! భూమి మాత ృదేశం.. ప్రకృతి జాతీయ సంస్కృతి! ప్రపంచంలోని ప్రతి దేశానికి వర్తిస్తున్న సనాతన సత్యం 'సనాతన సత్యం' అని అంటే 'శాశ్వత వాస్తవం'- ఆంగ్ల భాషలో 'ఎటర్నల్ ట్రూత్'- అని అర్థం. కానీ ఆంగ్ల సంవత్సరాది నాడు జనం అర్ధరాత్రి ఆరగిస్తున్నారు, మద్యం తాగుతున్నారు. మరికొందరు బరితెగించి "నోళ్లు ముక్కులు కార్చుకుంటూ" అశ్లీల పదజాలాన్ని ఆవిష్కరిస్తూ తందాన లాడుతున్నారు, వీధుల పైకి వచ్చి మద్యం సీసాలను పగలగొట్టి ఇతరులపై దాడులు చేస్తున్నారు, పోలీసులను సైతం దూషించి దౌర్జన్యకాండకు పూనుకుంటున్నారు. ఇలా 'నిశాచర'- రాత్రి యందు సంచరించే పిశాచాల, రాక్షసుల- ప్రవృత్తికి "జనంలో దాదాపు సగం" లోనవుతుండడం "ఆంగ్ల సంవత్సరాది" వేళ ఆవిష్కృతవౌతున్న దృశ్యం. ప్రతి ఏటా ఇది పునరావృత్తం.. ఈ ఏడు కూడ!! ఇలా మద్యం మత్తెక్కిన వారు రాత్రి మూడువంతులు ముగిసేవరకు వికృత విన్యాసాలు చేసి, అప్పుడు నిద్రలోకి జారుకుంటున్నారు, పగలు సగం గడిచేవరకు నిద్ర లేవరు!! ఇదంతగా భారతదేశపు భౌతిక స్వచ్ఛత భంగపడుతున్న తీరు! "బహిరంగ మలమూత్ర విసర్జన"కు స్వస్తి చెప్పించడమే భౌతిక స్వచ్ఛత కాజాలదు, మద్యం ఉత్పత్తి ప్రక్రియ, మద్యపాన ప్రక్రియ కూడ భౌతిక కాలుష్యాన్ని పెంచుతున్నాయి. అందువల్ల 'ప్లాస్టిక్'తోపాటు మద్యాన్ని కూడ నిర్మూలించడం భౌతిక స్వచ్ఛతకు అనివార్యమన్న పాఠాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడైన గ్రహించ గలగాలి!! బిహార్ ప్రభుత్వం మద్యపానాన్ని, ఉత్పత్తిని నిషేధించింది. దీనివల్ల రాష్ట్రానికి రావలసిన ఆదాయం తగ్గిపోయినప్పటికీ, వేలాది 'మద్యం' అభియోగాలను విచారించి తీర్పులు చెప్పడం మరింత ఖర్చుతో కూడిన న్యాయ ప్రక్రియ అయినప్పటికీ బిహార్ ప్రభుత్వం భరించగలుగుతోంది. మూడేళ్లకు పైగా మద్యనిషేధం అమలు జరగడంవల్ల, ఉల్లంఘించిన "తాగుబోతుల"కు, ఉత్పత్తిదారులకు వ్యతిరేకంగా రెండు లక్షల అభియోగాలు వివిధ న్యాయస్థానాలలో విచారణ దశలో ఉన్నాయట. ఈ మూడున్నర ఏళ్లలో బిహార్ పోలీసులు ఆరు లక్షల చోట్ల దాడులు జరిపి యాబయి రెండు లక్షల 'లీటర్'ల మద్యాన్ని పట్టివేసి, ధ్వంసం చేశారట. స్వచ్ఛ భారత్ నిజంగా ఏర్పడాలంటే ఇదే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ మద్య నిషేధానికి నడుం బిగించాలి. గుజరాత్‌లో మాత్రమే చాలాకాలంగా మద్య నిషేధం అమలులో ఉందట! 2015 నుంచి కేరళ ప్రభుత్వం, 2017 నుంచి తమిళనాడు, గత ఏడాది నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'మద్యం' ఉత్పత్తిని, పానాన్ని కొంతవరకు నియంత్రిస్తున్నాయి. కానీ మిగిలిన రాష్ట్రాల ప్రభుత్వాలు నడుములను బిగించడం లేదు. ఆంగ్ల సంవత్సర ప్రారంభ శుభవేళ.. ప్రతి సంవత్సరం మద్యం విక్రయాలు భయంకరంగా పెరిగిపోతున్నాయి, ఆదాయం పెరుగుతుందన్న భావంతో ప్రభుత్వాలు మురిసిపోతున్నాయి. హైదరాబాద్ మహానగరంలో మాత్రమే డిసెంబర్ 31వ తేదీన రెండు వందల పది కోట్ల రూపాయల విలువైన మద్యాన్ని తాగుబోతులు కొనేశారట. తెలంగాణలో అదే రోజున మూడువందల యాబయి కోట్ల రూపాయల విలువైన ఈ "తీయటి విషం" అమ్ముడుపోవడం మరో వాస్తవం...

పల్లెప్రగతిలో కలెక్టర్ల చురుకైన పాత్ర

-క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రోత్సాహం

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): పల్లె ప్రగతి కార్యక్రమం రెండోవిడతలోనూ గ్రామాల్లో చురుకుగా కార్యక్రమాలు సాగుతున్నాయి.ప్రధానంగా పారిశుధ్యం,వైకుంఠ ధామాల ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టి ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ పోతున్నారు. గ్రామాల రూపు రేఖలు సమూలంగా మార్చే బృహత్తర ప్రణాళికగా దీనిని ముందుకు తీసుకుని పోతున్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టి ముందుకెళుతోంది. దీనిలో భాగంగానే మొదటి విడత పల్లె ప్రగతి కార్యక్రమాన్ని సర్కారు దిగ్విజయంగా పూర్తి చేసింది. రెండో విడత పల్లె ప్రగతిని కూడా విజయవంతంగా అమలు చేస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఇందులో భాగస్వాము లవుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి వసతి, కరెంటు సరఫరా, ఇతర సదుపాయాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నారు. ప్రధానంగా కలెక్టర్లు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమానలు ముందుకు తీసుకుని వెళుతున్నారు. పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. పలువురు అధికారులు, స్థానికులు ఇందులో పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్లలె ప్రగతి ఎంతో దోహదపడుతుందని వరంగల్ కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ అన్నారు. ప్రగతి కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కామారెడ్డి కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు, అధికారులు ఇందులో పాల్గొంటున్నారు.

ప్రతీ గ్రామంలో డంపింగ్ యార్డు, శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో రెండో విడత పల్లెప్రగతికి విశేష స్పందన వస్తోంది. చంద్రాయన్ పల్లిలో జరిగిన కార్యక్రమంలో సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఐఎఫ్ వో ఓఎస్ డీ ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు. ప్లలె ప్రగతిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్ అన్నారు. ఎల్లారెడ్డి పేట మండలం బొప్పాపూర్ లో నిర్వహించిన ప్లలె ప్రగతిలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులు, విద్యార్థులతో కలిసి చెత్తను ఏరివేశారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కరీంనగర్ సుడా చైర్మన్ జీవీ కృష్ణారావు అన్నారు. మానకొండూరు మండలం లింగాపూర్ లో జరిగిన ప్లలె ప్రగతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికులతో కలిసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని కృష్ణారావు సూచించారు. అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండవ విడత ప్లలె ప్రగతి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. జిల్లాలోని 453 గ్రామపంచాయతీల పరిధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు ఇందులో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఇచ్చోడ మండలం ముక్ర- కే గ్రామంలో ప్లలె ప్రగతికి విశేష స్పందన లభించింది. స్థానికులు పెద్ద ఎత్తున ఇందులో పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోతిరెడ్డిపల్లి గ్రామంలో రెండో విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో కలెక్టర్ అనితా రామచంద్రన్ పాల్గొన్నారు. నర్సరీ, వైకుంఠ ధామం, డంపింగ్ యార్డ్ పనులను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు ఇందులో పాల్గొన్నారు పాల్గొన్నారు.

మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రాధాన్యం

-కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, జనవరి 7 (నేటినిజం ప్రతినిధి):మహిళల భద్రత,రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు పనిచేయాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర పోలీస్‌శాఖ ఈ సంవత్సరంలో మహిళల భద్రత,రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రాధాన్యతనిచ్చిందని పేర్కొన్నారు.

కరీంనగర్ కమీషనరేట్ నేరసమీక్షా సమావేశం సోమవారం నాడు కమీషనరేట్ కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాలతోపాటు ప్రజల భద్రత,రక్షణ కోసం పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర,జాతీయ రహదారులకన్నా ఇంటర్నల్‌రోడ్లపైనే ఎక్కువశాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇంటర్నల్‌రోడ్లలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్లూకోల్ట్స్,పెట్రోకార్స్‌ల గస్తీలతో నేరాలు నియంత్రణలోకి వచ్చాయని తెలిపారు. సిసి కెమెరాల ఏర్పాటులో అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. సిసి కెమెరాలు లేని గ్రామాలు ఉండకూడదని పేర్కొన్నారు. వివిధ రకాల నేరాల్లో నిందితులకు శిక్షలుపడేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమర్థవంతంగా పనిచేయని అధికారులపై శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డుప్రమాదాలు జరిగిన ప్రాంతాలను ఏసిపిలు పరిశీలించాలని పేర్కొన్నారు. ఎక్కువశాతం ప్రమాదాలు జరుగుతున్న అల్గునూరు ఛౌరస్తాలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ-పెట్టి కేసులను నమోదుచేస్తూ పెద్దపెద్ద నేరాలను నియంత్రించాలని తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించేవారిపై ఈ-పెట్టికేసులను నమోదు చేయాలని ఆదేశించారు. రోడ్డుభద్రత,ప్రమాదాల నివారణకు ప్రభుత్వం 250నుండి300కోట్లరూపాయలను వెచ్చించనున్నదని పేర్కొన్నారు. అతివేగం, అజాగ్రత్తల వల్లనే ఎక్కువశాతం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో రెండుమూడుసార్లు పట్టుబడినవారి లైసెన్సుల రద్దుకు ప్రతిపాదనలు పంపనున్నామని చెప్పారు. హైవేరోడ్లపై స్పీడ్‌గన్‌లను వినియోగిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా పెరిగి ప్రమాదాలకు కారణం అవుతున్న చెట్లను తొలగించాలని సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్‌ల కౌన్సిలింగ్‌ల సందర్భంగా పట్టుబడినవారి కుటుంబసభ్యులకు ప్రమాదాలు జరిగేతీరు, నష్టాలను తెలియజేస్తూ రూపొందించిన లఘుచిత్రాలను చూపాలని తెలిపారు.

దేశంలో అలజడులకు ఆజ్యం పోస్తున్నదెవరు?

హైదరాబాద్, జనవరి 7:దేశంలో అశాంతిని అలజడిని సృష్టించేందుకు కొందరు చేస్తున్న యత్నాలు ఇటీవల ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. వీరికి విదేశీ శక్తులు కూడా దోహదపడుతున్నట్లుగా స్పష్టం అవుతోంది. ప్రధానంగా పౌరచట్టం తీసుకుని వచ్చిన తరవాత జరుగుతున్న ఆందోళనల క్రమాన్ని గమనిస్తే ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయన్నది గమనించవచ్చు. అధికారం కోల్పోయిన తరవాత కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రధానంగా ఇందులో భాగస్వాములు అవుతున్నారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి, అవినీతి కుటుంబ పాలనలో కూరుకుపోయిన కాంగ్రెస్ పార్టీ తమకు ఇక అధికారం దక్కదన్న అక్కసుతో వీలు చిక్కినప్పుడల్లా విధ్వంస కార్యకలాపాలకు ఆజ్యం పోస్తోంది. పౌరచట్టం కేవలం శరణార్థులైన హిందూ తదితర మతాలకు చెందినదే అయినా అది ముస్లింలకు వ్యతిరేకమన్న ప్రచారం సాగించింది. దేశంలో ఇలా అలజడికి ఆజ్యం పోస్తున్న కాంగ్రెస్,కమ్యూనిస్టులకు మమతా బెనర్జీలాంటి వారు తోడయ్యారు. వీరందరికి దేశం కన్నా స్వార్థ రాజకీయాలే ముఖ్యం. అందుకే అలజడులను ఆపేకన్నా ఆజ్యం పోయడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. తాజాగా జెఎన్‌యూలో జరిగిన దాడికి ఎక్కడో లింక్ ఉండే ఉంటుంది. ఎందుకంటే ఇటీవల జెఎన్‌యూలో కూడా పౌరచట్టానికి వ్యతిరేకంగా అల్లర్లు చోటు చేసుకున్నాయి. దేశంలోని ఉన్నత శ్రేణి విద్యాసంస్థల జాబితాలో మూడో ర్యాంకుతోవున్న ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం లోకి ముసుగులు ధరించిన దుండగులు ఇనుపరాడ్లు, హాకీ స్టిక్‌లు, కర్రలు పట్టుకుని చీకటిచాటున దాదాపు రెండున్నర గంటలపాటు విశ్వవిద్యాలయం ఆవరణలో స్వైర విహారం చేసిన తీరు చూసి దేశం మొత్తం విస్తుపోయింది. వారి చేతుల్లో యాసిడ్ బాటిళ్లు కూడా ఉన్నాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారంటే ఆ గూండాలు ఎంతకు తెగించారో అర్థమవుతుంది. ఆఖరికి ఆడపిల్లల హాస్టల్‌లో సైతం వారి దౌర్జన్యం యథేచ్ఛగా కొనసాగింది. దేశ రాజధాని నగరంలోని ప్రఖ్యాత యూనివర్సిటీయే ఈ దుస్థితిలోవుంటే మిగతా యూనివర్సిటీల సంగతి చెప్పక్కర్లేదు. దుండగులు తనను గుర్తించి మరీ తల బద్దలు కొట్టారని, చేయి విరగ్గొట్టారని అయిషీ ఘోష్ అంటున్నారు. తమపై దాడి చేసింది ఏబీవీపీకి చెందినవారేనని గాయపడిన వారు చెబుతుంటే, తమ ప్రమేయం లేదని ఆ సంస్థ ఖండిస్తోంది. నిజానికి ఎబివిపి, లెఫ్ట్ విద్యార్థి సంఘాల మధ్య ఆదినుంచీ వైషమ్యాలు ఉన్నాయి. కానీ ఎబివిపి ఇలాంటి పాశవిక దాడి చేసిందని చెప్పడం ద్వారా అసలు దాడి చేసిన వారిని దాచేసే కుట్ర జరిగిందని గుర్తించాలి. మొత్తం వ్యవహారాన్ని ఎబివిపి మీదకు నెడితే అసలు దోషులు తప్పించుకునే యత్నం జరగదా అన్నది గుర్తించాలి. మరోపక్క కొన్ని చానెళ్లు వీడియోల ఆధారంగా దుండగులకు ఏబీవీపీతో సంబంధాలున్నాయని ఆరోపిస్తున్నాయి. దౌర్జన్యం కొనసాగినంతసేపూ వీధి దీపాలు స్విచాఫ్ చేసిందెవరో కూడా తేలాలి. ఆ దీపాల వెలుతురుంటే దుండగులు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోకి రావడం, పోవడం అంత సులభమయ్యేది కాదు. రెండురోజులుగా విశ్వ విద్యాలయంలో ఉద్రిక్తతలున్నా, విద్యార్థి సంఘాల మధ్య అడపా దడపా ఘర్షణలు చోటు చేసుకున్నా విశ్వవిద్యాలయం బాధ్యులు తమకు సంబంధం లేనట్టు చోద్యం చూశారు. వాస్తవానికి గత రెండున్నర నెలలుగా విశ్వవిద్యాలయం ఆందోళనలతో అట్టుడుకుతోంది. ఫీజులు, మెస్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల మధ్య ఘర్షణలు జరిగిన సందర్భాలున్నా అవి హింతకదాడుల వరకూ వెళ్లకపోవడం, ఇక్కడివారు చదువుల్లో ఎప్పుడూ మేటిగా ఉండటం ఈ విశ్వ విద్యాలయం ప్రత్యేకత. ఇంతటి ప్రత్యేకత ఉన్న యూనివర్సిటీలో ఏం జరిగినా ఇతర యూనివర్సిటీల్లో ఆందోళనకు విద్యార్థులు దిగుతున్నారు. ఒకవర్గానికి చెందిన విద్యార్థి సంఘాల వారే ఇందుకు పూనుకుంటున్నారు. వారికి ఆయా రాజకీయ పార్టీల వారు అండగా నిలుస్తున్నారు. మొత్తంగా ఇదంతా ఓ ప్లాన్ ప్రకారం జరుగుతోందన్న అనుమానాలు కలుగుతున్నాయి. తమ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు నిర్వహిస్తున్న ఉద్యమాలను సహించలేక, పాశవిక దాడులతో పోరాటాలను అడ్డుకోవాలని చూస్తున్నారని కొందరు విద్యార్థులు చేస్తున్న ఆరోపణల్లో కూడా నిజం లేదు. ఇది బలం లేని ఆరోపణగా చూడాలి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌తో మాట్లాడి క్రైమ్ బ్రాంచ్‌కు కేసును అప్పగించారు. వారు దర్యాప్తు చేస్తున్నారు. నిజానికి ఈ ఘటనపై సీరియస్‌గానే కేంద్రం తక్షణంగా స్పందించి విచారణకు ఆదేశించింది. దుండగులను కూడా గుర్తించారని అంటున్నారు. పౌరసత్వ సవరణ చట్టం , జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సి), 370 ఆర్టికల్ రద్దు లాంటి చర్యలపై మత ప్రాతిపదికగా ఉద్యమాలు సాగించడం ,యూనివర్సిటీల్లో వాటికి అనుకూలంగా ఉద్యమాలను లేవనెత్తడం కుట్రదారుల పన్నాగంగా కనిపిస్తోంది. ఢిల్లీ జామియా సహా దేశ వ్యాప్తంగా పలు వర్శిటీల్లో ఆందోళనలు గమనిస్తే అసలు విషయాలు అర్థం చేసుకోవచ్చు. జెఎన్‌యు విద్యార్థులపై జరిగిన దాడిపై కేంద్రం సమగ్ర విచారణకు ఆదేశించి దోషులను కఠినంగా శిక్షించాలని నిర్ణయించినందున విమర్శకులు తమ ఆరోపణలను పక్కన పెట్టాలి. విదేశీశక్తుల సాయం తీసుకుని ఉద్యమాలు కొనసాగించే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలి. యూనివర్సిటీలను రాజకీయాలకు దూరంగా ఉంచేలా చేయాలి. అప్పుడే ప్రశాంత వాతావరణం రాగలదు.

అసమ్మతి నేతలకు గాలం వేసే పనిలో బిజెపి

అధికార టిఆర్ఎస్‌లో పెరుగుతున్న పోటీ
టిక్కెట్ రాని వారు బిజెపి వైపు చూసే పరిస్థితి
కాంగ్రెస్‌లోనూ ఆశావహుల టిక్కెట్ల వేట

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): అధికార పార్టీలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పోటీ పెరిగింది. పలువురు ఆశావహులు తమకే టిక్కెట్ అన్న రీతిలో పట్టుబిగించారు. దీంతో రెబల్స్ బెడద కనినిస్తోంది. స్వయంగా మంత్రి కెటిఆర్ కూడా దీనిని అంగీకరించారు. వారిని అదుపు చేసే బాధ్యత స్థానిక నాయకత్వాని దేనని అన్నారు. దీంతో మున్సిపోట్స్‌లో ఇతర పార్టీలకన్నా అధికార టిఆర్ఎస్‌కు అసమ్మతి బెడద తీవ్రంగా ఉండనుంది. ఇదే అదనుగా ఈవర్గంపై కన్నేసిన బీజేపీ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. నాయకత్వం ఉన్న వార్డుల్లో పాత వారినే బరిలోకి దింపుతు నాయకత్వం లేని వార్డుల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలకు గాలం వేస్తుంది. టీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా విడుదలైతే మరికొంత మంది బయటకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తోంది నామినేషన్ చివరివరకు వేచిచూసి టీఆర్ఎస్‌లో అవకాశం దక్కని వారిని తమవైపు తిప్పుకునేందుకు ప్లాన్ చేస్తోంది. ఈనెల 8 తర్వాత భారీగా సమీకరణలు ఉండేలా కనిపిస్తోంది. ముఖ్యంగా యువనాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో బీ జేపీ పావులు కదుపుతోంది. రిజర్వేషన్ ఖరారు కావడంతో నేతలు వార్డుల వారీగా అభ్యర్థుల గెలుపును అంచనా వేస్తూ సీరియస్‌గా దృష్టి సారిస్తున్నారు. కొన్ని వార్డులలో ముగ్గురు, నలుగురు ఆశావహులు పోటీకి సిద్ధమవుతుండగా మరికొన్ని వార్డుల్లో నాయకత్వం లేక కొత్తవారి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల తొలిఘట్టమైన రిజర్వేషన్ పక్రియ పూర్తికావడంతో ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహులు పోటాపోటీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. రిజర్వేషన్ వచ్చేంతవరకు చూద్దాం.. అంటూ ఇన్నాళు తప్పించుకున్న నేతలకు అభ్యర్థుల ఎంపిక అగ్నిపరీక్షగా మారుతోంది. ఎవరినికాదన్నా ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న భయం వెంటాడుతోంది. ఒక్కోవార్డు నుంచి కనీసం ఐదారుగురు ఆశావహులు పోటీ చేసేందుకు ఆసక్తి చూపడంతో అభ్యర్థుల ఎంపిక ప్రధాన పార్టీలకు సవాలుగా మారుతోంది. ఏ వార్డులో చూసిన పోటీ వాతా వరణమే కనిపిస్తోంది. అధికార టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందు కు ఎక్కువమంది ఆశావహులు ఆసక్తి చూపుతున్నారు. ఆయా మున్సిపాలిటీల్లో అనేక వార్డుల్లో లెక్కకు మిక్కిలి దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఒక సర్వేను పూర్తిచేసిన టీఆర్ఎస్ 70శాతం మంది అభ్యర్థుల ఎంపికను పూర్తిచేసింది. మిగితా 30శా తం మంది అభ్యర్థుల జాబితా నేడోరేపో వూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నామినేషన్ల కంటే అసమ్మతిని తగ్గించేందుకు వార్డుల వారీగా సీనియర్ నేతలను ఇన్‌చార్జీలుగా నియమించి పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది. అన్ని జిల్లాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ముఖ్యంగా అధికార టీఆర్ ఎస్, బీజేపీ పార్టీల్లో తీవ్ర పోటీ నెలకొంది. దీంతో టీఆర్ఎస్ సర్వేల పేరిటా వడపోత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బీజేపీ మాత్రం పార్టీలో క్రీయాశీలకంగా పనిచేస్తూ వస్తున్న నేతలకు బీ పారాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపుతుండగా అసలే ప్రాతినిధ్యంల నివార్డుల్లో వేచిచూసే ధోరణితో కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో గతరెండు రోజుల క్రితమే అగ్రనే తల మధ్య సమన్వయం కుదరడంతో ఎన్నికలపై ప్రత్యేక కమిటీని వేశారు. గతంలో పోటీచేసిన సిట్టింగ్‌లతోపాటు కొత్తగా పోటీకి ముందుకువస్తున్న వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతల ఇళ్లవద్ద వచ్చిపోయే ఆశావ హులుతో సందడి వాతావరణం కనిపిస్తోంది. ఎన్నడూలేని విధంగారాజకీ యంలో చురుకుగా కనిపించని వార్డు నేతలు సైతం నేతల వద్ద పలుకుబడిని పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ తరుపున పోటీ చేసే అభ్యర్థులు గెలిచిన తర్వాత పార్టీలో ఉంటారనే గ్యారంటీ లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పరతులతో కూడిన అఫిడావిట్ తీసుకు న్న తర్వాతనే పార్టీ బీ ఫాంలను ఇచ్చేందుకు సిద్ధ మవుతున్నారు. ముఖ్యంగా ఈ ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ ఫండ్‌ను ఇచ్చే పరిస్థితిలో కని పించడం లేదు. దీంతో ధన బలమున్న అభ్యర్థులనే రంగంలోకి దింపాలని యోచిస్తోంది. వార్డుల వారీగా పోటీ చేసే అభ్యర్థులు ఎన్ని ఓట్లు చీల్చుతారనే అంచనా వేస్తున్నారు. వార్డులో ఉన్న మొత్తం ఓట్లను పోటీ చేసే అభ్యర్థులకు కేటాయించి గెలిచేందుకు కావాల్సిన ఓట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సామాజిక వర్గాల వారీగా లెక్కలు వేస్తూ వార్డులో ఎక్కువ ఓట్లు ఉన్న సామాజిక వర్గానికి మరింత దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తిస్తూ గెలిచిన తర్వాత అభివృద్ధి చేస్తామంటూ హామీలను గుప్పిస్తున్నారు.

స్వేచ్ఛగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ

పకడ్బందీ చర్యలకు అధికారుల కసరత్తు
అబ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక నజర్

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): మున్సిపాలిటీ ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీల్లో ఎన్నికల సంఘం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికల ప్రకటన వెలువడిన రోజు నుంచి ఎన్నికల పక్రియ ముగిసే వరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రభుత్వం, ఎన్నికల విధుల్లో ఉండే అధికార యంత్రాంగం, సిబ్బంది ప్రవర్తనా నియమావళి అనుసరించాల్సిందే. ఎవరైనా దీన్ని ఉల్లంఘిస్తే ప్రజలు 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చును బ్యాంకు ఖాతా ద్వారానే చెల్లించాల్సి ఉంది. దీంతో ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న అభ్యర్థులు బ్యాంకుల్లో కొత్తగా ఖాతాలను తెరవాల్సి ఉంది.మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల్లో రూ. 1 లక్ష వరకు మాత్రమే ఖర్చు చేసేందుకు అనుమతి ఉంది. గతంలోనూ ఇలాంటి నిబంధనలే ఉన్నా, వీటిని ఖచ్చితంగా అమలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ప్రచారం సందర్భంగా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ఖర్చు చేయాలి. రిటర్నింగ్ అధికారి అభ్యర్థికి అందించిన నిర్ధిష్ట నమూనాలో రోజువారీ ఖర్చుల వివరాలు రాయాలి. ప్రత్యేక ఖాతా తెరిచి అందులో నుంచి డబ్బులను విత్‌డ్రా చేయాలి. ఎన్నికల ఫలితాలు వెలువడిన 45 రోజుల్లో వివరాలు విధిగా ఎన్నికల అధికారికి అందజేయాలి. రాజకీయ పార్టీ, పోటీ చేసే అభ్యర్థి ఉద్రిక్త పర

బీజేపీకి హటావో దేశ్‌కి బచావో అనే వాళ్లతో కలిసి వెళ్తాం

- పౌరసత్వ బిల్లు మత వ్యతిరేఖ చట్టం
- సీఏఏపై సీఎం కేసీఆర్ తన వైఖరిని స్పష్టం చేయాలి
- కేసీఆర్ ప్రగతి భవన్‌కే పరిమితమయ్యాడు
- రాష్ట్రంలో ప్రగతికి విఘాతం కలుగుతోంది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

కరీంనగర్, జనవరి 7(నేటినిజం ప్రతినిధి) : తెలంగాణలో మున్సిపాలిటీ ఎన్నికల్లో.. బీజేపీకి హటావో దేశ్ కి బచావో అనే వాళ్లతో సీపీఐ కలిసి వెళుతుందని, మా పార్టీలో చర్చించి.. కలిసి వచ్చే పార్టీలతో పరస్పర చర్చల ద్వారా పోటీ చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ లోని సీపీఐ భవన్ లో చాడ వెంకట్ రెడ్డి సోమవారం విలేకరులతో మాట్లాడారు.. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ బిల్లు మత వ్యతిరేక చట్టమని అన్నారు. అసోంలో ఇప్పటి వరకు 19లక్షల మందికి పౌరసత్వం ఇవ్వలేదన్నారు. బతకడానికి వచ్చిన శరణార్థులకు ఒక టైంపెట్టి వాళ్ళకు పౌరసత్వం ఇవ్వాలన్నారు. పౌరసత్వ సవరణ చట్టం బిల్లును ఆనాడు వ్యతిరేకించి.. ఇప్పుడు అమలు చేసే విషయంలో మౌనంగా ఉంటున్న కేసీఆర్ మౌనముద్ర వీడి సీఏఏపై తన వైఖరి చెప్పాలని చాడ అన్నారు. అలాగే కేటీఆర్ ముఖ్యమంత్రి పదవి చేపడుతాడన్న మంత్రుల ప్రచారంపై, వారసత్వం రాజకీయాలపై కేసీఆర్ క్లారిటీ ఇవ్వాలన్నారు. సీపీఐ వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని అన్నారు. తెలంగాణలో ఎన్నో సమస్యలున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, రైతులకు రైతు బంధు, రుణమాఫీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని చాడ అన్నారు. రైతు బంధు పథకం పైన ఐదు ఎకరాలు ఉన్నవారికే ఇస్తానని షరతులు విధిస్తున్నారని అన్నారు. స్కూళ్లు, కాలేజీలు మూసేస్తున్నారని, 27వేల కోట్ల రూపాయలు ప్రాజెక్టు బకాయిలు పేరుకుపోయి పనులు నిలిచిపోయాయని అన్నారు. కేసీఆర్ ప్రగతి భవన్‌కే పరిమితం కావడంతో.. తెలంగాణలో ప్రగతికి విఘాతం కలుగుతోందని వెంకటరెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం వల్ల ధన్యం కావాల్సింది కేసీఆర్ జీవితం కాదని, ప్రజల జీవితాలు ధన్యం కావాలని చాడ ఈ సందర్భంగా అన్నారు. కేసీఆర్ రెండో సారి అధికారంలోకి వచ్చిఏడాది గడిచినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వంపై సీపీఐ ఉద్యమాలు చేపడుతుందన్నారు.

తల్లిదండ్రుల నుంచి పిల్లలను వేరుచెయ్యం

- ఎన్ఆర్సీపై కేంద్రం హామీ

గౌహతి, జనవరి7(ఆర్ఎన్ఎ) : ఎన్ఆర్సీ పేరుతో తల్లిదండ్రుల నుంచి పిల్లలను వేరు చేయమని కేంద్ర న్యాయశాఖ ఉన్నతాధికారి కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. అసోం ఎన్ఆర్సీపై సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. పిల్లలను తల్లిదండ్రులు, కుటుంబాల నుంచి వేరు చేస్తున్నారని.. వారిని డిటెన్షన్ సెంటర్లకు తరలిస్తున్నారని ఓ సంస్థ సుప్రీంకోర్టుని ఆశ్రయింది. అసోం జాతీయ పౌరుల రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాని పిల్లలను తల్లిదండ్రుల నుంచి వేరు చేస్తున్నారని, ఇది దారుణం అని పిటిషన్ లో తెలిపారు. సోమవారం దీనిపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. దీనికి కేంద్ర న్యాయ శాఖ ఉన్నతాధికారి కేసీ వేణుగోపాల్ వివరణ ఇచ్చారు. పిల్లలను తల్లిదండ్రుల నుంచి కుటుంబాల నుంచి వేరు చేయము అని, ప్రస్తుతానికి ఆపేస్తామని కోర్టుకి హామీ ఇచ్చారు. అసోంలో పౌరుల రిజిస్టర్‌లో కొందరు తల్లిదండ్రులు, కుటుంబాల పేర్లు ఉన్నాయని, అయితే వారి పిల్లల పేర్లు మాత్రం జాబితాలో లేవు. దీంతో పిల్లలను వేరు చేసి డిటెన్షన్ సెంటర్లకు తరలిస్తున్నారు. దీనిపై ఓ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టుని ఆశ్రయించింది. ఇది అన్యాయం అని వాదించింది. దీనిపై నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు బెంచ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల రిజిస్టర్(ఎన్ఆర్సీ) కు వ్యతిరేకంగా అసోంలో పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నాయి. ఇవి చట్ట వ్యతిరేకం అని, రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ లబ్ది కోసమే బీజేపీ ప్రభుత్వం వీటిని తీసుకొచ్చిందని ఆరోపిస్తున్నారు. వీటి వల్ల తమ భాష, సంస్కృతి ప్రమాదంలో పడుతుందని భయపడుతున్నారు. పౌరసత్వ సవరణ బిల్లు ముసుగులో బీజేపీ హిందూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపణలు చేస్తున్నారు. తమ సొంత రాష్ట్రంలోనే భాషాపరమైన మైనారిటీలు అవుతామని వాపోతున్నారు.

కీచక వార్డెన్‌కు దేహశుద్ధి

- అదిలాబాద్ జిల్లాలో ఘటన

అదిలాబాద్, జనవరి 7(ఆర్ఎన్ఎ) : తెలంగాణలో మరో కీచక ఘటన వెలుగులోకి వచ్చింది. విద్యార్థినులను కన్న కూతుళ్లలా చూసుకుంటూ సంరక్షించాల్సిన హాస్టల్ వార్డెన్ కీచకుడిగా మారాడు. వారిని గదుల్లోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ దారుణ ఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్‌లో చోటుచేసుకుంది. ఓ గిరిజన బాలిక హాస్టల్‌లో ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమెపై కన్నేసిన హాస్టల్ వార్డెన్ వసంతరావు ఇటీవల ఆమెను గదిలోకి పిలిచి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఎక్కడెక్కడో చేతులు వేసి తడుముతూ పైశాచికానందాన్ని పొందాడు. దీంతో భయపడిపోయిన బాలిక వెంటనే బయటకు పరుగులు తీసి ఈ విషయాన్ని తన కుటుంబసభ్యులకు చేరవేసింది. దీంతో సోమవారం హాస్టల్‌కు వచ్చిన బాధితురాలి బంధువులు వార్డెన్‌ను నిలదీశారు. అతడు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో దాడికి పాల్పడ్డారు. వార్డెన్ తనను నెల రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడని విద్యార్థిని చెబుతోంది. తనకంటే ముందే చాలామంది బాలికలను కూడా ఇదే విధంగా వేధించినట్లు ఆరోపిస్తోంది. ఈ ఘటనపై స్కూల్ ప్రిన్సిపాల్‌కు విద్యార్థిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు సైతం విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

బాలికల అదృశ్యంపై కేసు

కౌంటర్ దాఖలు చేయాలన్న హైకోర్టు

ఎమ్మెల్యే రెడ్యానయక్‌పై స్థానికుడి ఫిర్యాదు

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వ్యాప్తంగా మైనర్ బాల బాలికల అదృశ్యం న్యాయవాది రాపోల్ భాస్కర్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. పోలీసులు బాలికల మిస్సింగ్ కేసును మూసివేశారని, ఇట్టి కేసులను మళ్లీ రీ ఓపెన్ చేయాలని ఆయన కోర్టును కోరారు. అదేవిధంగా ప్రతి జిల్లాకు స్పెషల్ అధికారులను నియమించి విచారణ చేపట్టాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే హాజిపూర్ ఘటనలో అదృశ్యమైన బాలికల తరహాలోనే వీరి అదృశ్యం జరిగి ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా క్లోస్ చేసిన 2 వేల కేసులను మళ్లీ తిరిగి విచారణ జరిపించాలని కోర్టును కోరారు. ఈ నేపథ్యంలో హైకోర్టు పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపి..కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసినట్లు హైకోర్టు పేర్కొంది.ఇదిలావుంటే తన ఇంటి ముందు ఉన్న స్కూల్‌ను కూల్చివేసి పార్కింగ్‌కు వాడుకుంటున్న దోర్నకల్టిఆర్ఎస్ ఎమ్మెల్యే రెడ్యా నాయక్‌పై అదే గ్రామానికి చెందిన డిఎస్ వెంకన్న నాయక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన 3 ఎకరాల స్థలాన్ని రెడ్యా నాయక్ కబ్జా చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన తన భార్య, ఇద్దరు కొడుకుల పేర్లను మార్చి మొదటి విడతలో ఇందిరమ్మ గృహాలు పొందారని, ఉపాధి హామీ పథకం కింద తన పేరున ఉన్న భూమిని కొడుకు పేరు మీద ఉన్నట్లు చూపించి నిధులు పొందారని కోర్టుకు తెలిపారు. వెంకన్న నాయక్ పిటిషన్‌ను సోమవారం విచారించిన హైకోర్టు పూర్తి వివరాలు ఇవ్వాలని హోంశాఖను అదేశించింది. కాగా తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదికి వాయిదా వేసింది.

లింగమార్పిడి వ్యక్తి ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగు చసిన ఘటన

భోపాల్,జనవరి7(ఆర్ఎన్ఎ): ఎనిమిదేళ్ల క్రితం లింగ మార్పిడి చేసుకున్న వ్యక్తి రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండర్‌లో శనివారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. పాలక్(26) అనే వ్యక్తి లింగ మార్పిడి చేయించుకున్నాడు. ఆ తర్వాత స్థానికంగా ఉన్న ఓ దేవాలయంలో మరో వ్యక్తిని వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లు వివాహ జీవితం బాగానే ఉన్నప్పటికీ.. ఆమె తీవ్ర ఒత్తిడికి గురయ్యేది. సర్జరీ అనంతరం శారీరకంగా సమస్యలు కూడా వచ్చాయి. గత కొద్ది రోజుల క్రితం సర్జరీ కూడా ఫెయిలవడంతో మానసికంగా కుంగిపోయింది. దీంతో శనివారం రాత్రి తాను నివాసముంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఢిల్లీ ఎన్నికలకు మోగిన నగారా

- షెడ్యూల్‌ను విడుదల చేసిన సీఈసీ
- ఫిబ్రవరి 8న పోలింగ్, 11న ఫలితాలు
- ఒకే విడతలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

న్యూఢిల్లీ, జనవరి7(ఆర్ఎన్ఎ) : ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 22తో అసెంబ్లీకి గడువు ముగియనుండగా సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడించింది. మొత్తం 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 8న పోలింగ్ నిర్వహించి, అదే నెల 11న ఫలితాలను వెల్లడించనున్నారు. ఇందుకు జనవరి 14న నోటిఫికేషన్ వెల్లడించనున్నట్టు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోరా తెలిపారు. అదే రోజు నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. నామినేషన్ల దాఖలుకు జనవరి 21 చివరి తేదీ కాగా, జనవరి 23న పరిశీలన ఉంటుందన్నారు. అలాగే నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువును జనవరి 24గా ప్రకటించారు. జనవరి 6 నాటికి ఢిల్లీలో మొత్తం 1,46,92,136 ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల సంఘం ప్రధాన అధికారి సునీల్ అరోరా తెలిపారు. మొత్తం 13,767 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు 90 వేల మంది సిబ్బంది అవసరం ఉంటుందని తెలిపింది. సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని ఈసీ స్పష్టం చేసింది. 2015 ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ మొత్తం 67 స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అయితే, ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం ఏడు పార్లమెంటు స్థానాల్లోనూ బీజేపీ విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో తిరిగి అధికారం చేజిక్కించుకోవాలని ఆప్.. ఢిల్లీ పీఠాన్ని దక్కించుకోడానికి బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఈ ఎన్నికల్లో కేజ్రీవాల్‌కు పనిచేయనున్నారు.

పల్లె ప్రగతితో.. గ్రామాలు పచ్చదనం నింపుకోవాలి

- అందరూ ఐక్యంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోండి
- ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్

భద్రాచలం,జనవరి7(ఆర్ఎన్ఎ): పల్లె ప్రగతి -2లో ప్రజలందరూ పాల్గొని గ్రామాలను పచ్చగా, పరిశుభ్రంగా మార్చుకోవాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. దుమ్ముగూడెం మండలం నర్సాపూర్ గ్రామంలో సోమవారం జరిగిన 'పల్లె ప్రగతి' కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాలలో 250 కోట్ల రూపాయలతో 3 ఫేజ్ విద్యుత్తును అందిస్తున్నట్లు వెల్లడించారు. గిరివికాసం ద్వారా రూ. 105 కోట్ల వ్యయంలో గిరిజనుల భూములలో బోర్లు, మోటార్లు వేసి సాగుకు యోగ్యంగా చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనట్లుగా రాష్ట్రంలో అంగన్ వాడీలకు వేతనాన్ని పెంచినట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఇక మహిళల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసేందుకు మంత్రి పువ్వాడ అజయ్ సహకారంతో కృషి చేస్తానని చెప్పారు. ఇక ప్లలె ప్రగతి-2 లో ఏ కొరతా లేని ప్లలెలుగా మన తెలంగాణ ప్లలెలు తయారు కావాలని మంత్రి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి కేసిఆర్ దూరదృష్టితో అమలు చేస్తున్న ప్లలె ప్రగతిని సద్వినియోగం చేసుకుని గ్రామాలను ఏ లోటూ లేని ప్లలెలుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ మంత్రి పువ్వాడ అజయ్‌తో కలిసి నెరవేరాస్తామని సత్యవతి హామీ ఇచ్చారు. అనతరం గంగోలు గ్రామంలో రూ. 2.62 కోట్ల వ్యయంతో నిర్మితమైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను సత్యవతి ప్రారంభించారు. జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ కోరం కనకయ్య, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే పోదెం వీరయ్య, కలెక్టర్ వెంకటేశ్వర్లు స్థానిక ఎంపీటీసీ, జడ్పీటీసీ సర్పంచులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఊరూరా పల్లెప్రగతి జాతర

గ్రామాల్లో కొనసాగుతున్న శ్రమదానాలు

పెద్ద ఎత్తున పాల్గొంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి పర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన పల్లె ప్రగతి కార్యక్రమం ఊరూరా ఉత్సాహంగా కొనసాగుతున్నది. సంపూర్ణ పారిశుద్ధ్యమే ధ్యేయంగా రహదారులు, మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నారు. నిరూపయోగం.. ప్రమాదకరంగా ఉన్న బోర్లు, బావులను పూడ్చి వేసే విషయంలో అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ప్రగతి పనులకు సహకరించని నాలుగు వేల మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. పలు జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు విస్తృతంగా పాల్గొంటున్నారు. ఆదివారం జనగామ జిల్లాలోని పలు గ్రామాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రగతి పనుల్లో పాల్గొన్నారు. లింగాల ఘనపురం మండలం చీటూరు గ్రామంలో మంత్రి దయాకర్‌రావు చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో నింపి గ్రామస్థుల్లో ఉత్సాహం నింపారు. ఖమ్మం జిల్లా బోనకల్లు, చింతకాని మండలాల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. బోనకల్ మండలం రావినూతల పాఠశాలలో మొక్కలు నాటి పారతో పాదులు తీశారు. నిర్మల్ జిల్లా సోన్ మండలం శాకెర పంచాయతీ ఆవరణలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మొక్క నాటారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం సుంకెట్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బస్‌షెల్టర్‌ను ప్రారంభించి, మొక్క నాటారు.

అధికారులపై ఆగ్రహం ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్లలెప్రగతిలో భాగంగా ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన మంత్రికి విద్యుత్ సమస్యలపై మధిర ప్రజలు ఫిర్యాదు చేశారు. దానిపై అక్కడే విచారించిన మంత్రి మధిర విద్యుత్‌శాఖ ఏడీని వెంటనే సరెండర్ చేయాలని ఆదేశించారు. ఎ÷-లాస్టిక్ వాడటంతోపాటు అపరిశుభ్ర వాతావరణం ఉన్న మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారంలోని లక్ష్మీ గణపతి మద్యం దుకాణ యజమానికి అధికారులు రూ. 15 వేల జరిమానా విధించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సాతారంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నందుకు మటన్ దుకాణం నిర్వాహకులకు జరిమానా విధించారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ, కాళేశ్వరం పథకాలను కేంద్రం ప్రశంసిస్తూనే.. నిధులు ఇవ్వడంలో వివక్ష చూపుతున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపిం చారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని లక్ష్మీనారాయణపురంలో ఆదివారం నిర్వహించిన ప్లలెప్రగతి గ్రామసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వడం లేదని విమర్శిం చారు. రాష్ట్రాభివృద్ధికి పైసా ఇవ్వడం లేదన్నారు. ప్లలెప్రగతిలో ప్రజలు భాగస్వాములవ్వాలని, జన్మనిచ్చిన గ్రామానికి సాయం చేసి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. జనగామ జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావడం అభినందనీయమని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామంలో స్థానికులు నిర్మించుకున్న బస్‌షెల్టర్‌ను మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మొక్కను నాటారు. ప్రగతితో గ్రామాలు మహర్దశ సంతరించుకుంటున్నాయని చెప్పారు. తమ గ్రామాభివృద్ధి కోసం ప్రజలు విరాళాలివ్వాలని పిలుపునిచ్చారు. రెండో విడుత ప్లలెప్రగతి పనులు ఉద్యమంలా జరుగుతున్నాయని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్లు, చింతకాని మండలాల్లో ప్రణాళిక పనుల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. ప్లలె ప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. సీఎం ఆశయానికి అనుగుణంగా ప్రజలు గ్రామాల అభివృద్ధికి ముందుకొస్తుండటంతో ప్లలెల్లో అభివృద్ధి పరుగులు పెడుతున్నదన్నారు. ప్లలె ప్రగతి పనులపై నిర్లక్ష్యం వహించే అధికారులు ఇంటికి పోవాల్సిందేనని మంత్రి హెచ్చరించారు. పంచాయతీ కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు ప్రారంభించగా మంత్రి నడిపారు. ఆయనవెంట ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాతా మధు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు పాల్గొన్నారు ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాతనే తెలంగాణ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నదని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని శాకెర గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్లలె ప్రగతి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ఎ÷-లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. రోడ్లపై చెత్త పారేయొద్దని, హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. శాకెరలో చెక్‌డ్యాం నిర్మాణంతో భూగర్భజల మట్టం పెరిగిందన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంత్రి మొక్క నాటారు.

సందరనగరంగా జనగామ అభివృద్ధి

అభివృద్ధి కోసం టిఆర్ఎస్‌లో చేరుతున్నారు

మహిళా రిజర్వేషన్‌తో ఆశావహులకు చెక్

జనగామ,జనవరి7(ఆర్ఎన్ఎ): ప్రత్యేక శ్రద్ధతో జనగామ పట్టణాన్ని సుందరీకరించే పనులు జరుగుతు న్నాయని, రానున్న రోజుల్లో ప్రముఖ పట్టణాల సరసన జనగామ చేరుతుందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఆకర్షితులైన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, వామపక్ష పార్టీల నుంచి పెద్దఎత్తున టీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తితో ఉన్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గులాబీపార్టీ 30వార్డులు గెలుచుకోవడం ఖాయమని అన్నారు.

మాజీ కాంగ్రెస్ కౌన్సిలర్ మేకల రాంప్రసాద్ టీఆర్ఎస్‌లో చేరడాన్ని స్వాగతించారు. రైతుల సంక్షేమం కోసం గోదావరి జలాలతో చెరువులు నింపుతున్నట్లు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి చెప్పారు. ఇదిలా వుంటే జనగామ బల్దియా చైర్మన్ పీఠం రెండోసారి మ హిళకే దక్కనుంది. రాష్ట్రంలో పెరిగిన మున్సిపాలిటీల సంఖ్య ఫలితంగా తాజాగా రెండోసారి జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మహిళే ఎన్నికయ్యే అవకాశం దక్కింది. గత కౌన్సిల్‌లో మొత్తం 28 వార్డులకు 14 మంది మహిళలు ప్రాతినిధ్యం వహిస్తే ఈసారి 2 వార్డులు పెరగడంతో వారి సంఖ్య 15కు చేరింది. పంచాయతీరాజ్, స్థానికసంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఖరారైన తర్వాత కీలకమైన మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి రెండోసారి సైతం అతివలకే చేరువ కావడం విశేషం. పట్టణంలోని 39,728 మంది ఓటర్లు ఉన్న పట్టణంలో మొత్తం 30వార్డులకుగాను ఒక్కో వార్డులో 2 పోలింగ్ కేంద్రాల చొప్పున అంటే ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 662.13 ఓటర్ల నిష్పత్తి ప్రకారం 60 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల పరిధిలో కిలో మీటర్ లోపు ఓటర్లు వచ్చేలా పోలింగ్ కేంద్రాలను నిర్ణయించారు. చైర్మన్, వార్డుకౌన్సిలర్ స్థానాలు ఆశించిన కొందరు నాయకుల అంచనాలు తల్లకిందులు కావడంతో ఎన్నికల బరిలో సతులు, తల్లులు, కుమార్తెలను నిలిపేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. డ్రా విధానంలో మహిళలకు రిజర్వ్ అయిన వార్డులు మినహా మిగిలిన వార్డులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్‌రిజర్వ్‌డ్, జనరల్‌గా ప్రకటించారు. ఎస్టీ సామాజిక వర్గానికి ఒక స్థానం మాత్రమే కేటాయించడంతో మొత్తం వార్డులో ఎస్టీ ఓటర్లు, జనాభా ఏ వార్డులో ఎక్కువ ఉందో ఆ స్థానాన్ని ఎస్టీ జనరల్‌గా ఖరారు చేశారు.

నిజామాబాద్ పురపాలికల్లో కవిత అనుచరగణం?

అన్ని స్థానాలు మహిళకు రిజర్వ్ కావడంతో ఆసక్తి

ఎంపి అరవింద్ దూకుడుకు కళ్లెం వేసేలా వ్యూహం

నిజామాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి కనిపిస్తోంది. మాజీ ఎంపికవితతో నేతలు లోపాయకారిగా చర్చలు చేస్తున్నారు. కవిత బయటకు కనిపించకపోయినా,పరోక్షంగా నేతలకు సూచనలు ఇస్తూ ఎలా ముందుకు పోవాలో సూచిస్తున్నారని సమాచారం. ఈ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం చెప్పడం ద్వారా ఎంపి బండి సంజయ్‌కు గుణపాఠం చెప్పేందుకు ఆమె అనుచరగణం ప్రత్యక్షంగా రంగంలోకి దిగనున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల రిజర్వేషన్లను ప్రభుత్వం ప్రకటించింది. నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు బోధన్, ఆర్మూరు, భీమ్‌గల్ మూడు మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులు బీసీ మహిళకే దక్కడం విశేషం. నిజామాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత తొలిసారిగా మేయర్ పీఠం బీసీకే దక్కింది. ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొలిసారి జనరల్ మహిళకు మేయర్ సీటు కేటాయించారు. తొలిమేయర్‌గా ధర్మపురి సంజయ్ కొనసాగగా.. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి మహిళా మేయర్‌గా ఆకుల సుజాత ఎన్నికయ్యారు. కొత్త మున్సిపల్ చట్టాన్ని అనుసరించి వార్డులు, చైర్మన్లు, మేయర్ల రిజర్వేషన్లు రెండు టర్మ్‌లు కొనసాగనున్నాయి. అంటే ఈ ఐదేండ్లతో పాటు వచ్చేసారి కూడా ఇవే రిజర్వేషన్లు ఆయా సామాజిక వర్గాలకు వర్తిస్తాయి. వార్డుల వారీగా రిజర్వేషన్లు ప్రకటించడంతో బల్దియా పరిధిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. దీంతో ఆశావహులు ఎన్నికల బరిలో దిగేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసుకుంటున్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లు, బోధన్ 38, ఆర్మూర్ 36, భీమ్‌గల్ 12 వార్డులు ఉన్నాయి. టికెట్ల కేటాయింపు బాధ్యతలను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకే టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అప్పగించారు. ఆ ఎమ్మెల్యే గెలుపు గుర్రాలను ఎంపిక చేసుకుని అభ్యర్థుల పేర్లను అధిష్ఠానానికి

ఎన్నికలంటే ప్రతిపక్షాలకు భయం

- మున్సిపల్ ఎన్నికల్లో తెరాస విజయం ఖాయం
- ప్రజలను ఓట్లడిగే హక్కు ఒక్క తెరాసకే ఉంది
- గెలిచేసత్తా ఉన్నవారికే టికెట్లు కేటాయిస్తాం
- తెలంగాణకు కేంద్రం నిధులివ్వడంలో నిర్లక్ష్యం వహిస్తుంది
- నిధులిస్తున్నామని బీజేపీ నేతల తప్పుడు ప్రచారం తగదు
- మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్, జనవరి7(నేటినిజం ప్రతినిధి) : ఎన్నికలంటే ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని, ప్రజలు ఘోరంగా ఓడిస్తారని వారి ఇప్పటికే అనేసార్లు అర్థమైందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హుజురాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు కనబడుతాయని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికలంటే ప్రతిపక్షాలకు భయమని ఆయన పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీదే విజయమని తేల్చిచెప్పారు. కౌన్సిలర్ల ఎన్నిక తర్వాతనే మున్సిపల్ చైర్మన్ల ఎంపిక ప్రక్రియ ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. అభ్యర్థులకు బీ ఫారాలు ఇవ్వడంలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈటల అన్నారు. ప్రజలను ఓట్లు అడిగే హక్కు టీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. క్షణికావేశంలో నిర్ణయం తీసుకుంటే పైకి రాలేమమని మంత్రి అన్నారు. రాజకీయాల్లో హత్యలుండవని.. ఆత్మహత్యలే ఉంటాయన్నారు. కాంగ్రెస్ – బీజేపీలు ఎన్నికల పార్టీలే అని... కాంగ్రెస్ – బీజేపీ నిద్రలేచేలోపు ఎన్నికలు అయిపోతాయని వ్యాఖ్యానించారు. దేశ చరిత్రలో 32జెడ్పీలు గెలిచిన పార్టీ ఏదీలేదన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి జరిగిందని బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన అన్నారు.

కేంద్రం సంవత్సరానికి కేవలం 6 నుంచి 7 వేల కోట్లు మాత్రమే నిధులు కేటాయిస్తుందని అన్నారు. ఆ నిధులు కేంద్ర ప్రభుత్వం బిక్ష కాదు, మన హక్కు అని ఈటల అన్నారు. ఆ మాత్రం దానికే వేల కోట్లు ఇస్తున్నామనడం కరెక్ట్ కాదని ఆయన అన్నారు. అమిత్ షా రాష్ట్రానికి వచ్చినప్పుడు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ ప్రభుత్వం వివరణ ఇచ్చిందని ఆయన తెలిపారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచే సత్తా ఉన్నవారికే తమ పార్టీ తరపున టిక్కెట్లు కేటాయిస్తామని ఆయన అన్నారు. కౌన్సిలర్ల నిర్ణయం మేరకే.. చైర్ పర్సన్‌ల ఎంపిక ఉంటుందని ఆయన తెలిపారు. అందరిని కలుపుకుని, పార్టీ కోసం పనిచేసేవారికే టిక్కెట్లు ఇస్తామని ఆయన తెలిపారు. ఇండియా ఒక లౌకిక దేశమని, ఇక్కడ అన్ని మతాలు, వర్గాలు, జాతుల వారు సమానంగా, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో జీవించే హక్కు ఉందని ఆయన అన్నారు. పాలకులు తీసుకునే నిర్ణయాలు ప్రజల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉండకూడదని ఆయన అన్నారు. ప్రజల మధ్య లౌకిక స్ఫూర్తి దెబ్బతినకుండా చూడాలని ఈటల కోరారు.

మహిళా సర్పంచ్‌లదే కీలక బాధ్యత

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి: జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల,జనవరి7(ఆర్ఎన్ఎ): మహిళలు గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలని,ఇందులో మహిళా సర్పంచ్‌లు ప్రధానంగా ముందుభాగాన నిలవాలని జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత సూచించారు. గ్రామాల్లో మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వైకుంఠధామాల నిర్మాణం, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్లలె ప్రగతి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారని, గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో కరెంట్ స్తంభాలు, వీధి దీపాల సమస్యలను పరిష్కరిస్తామని సూచించారు. దశాబ్దాలుగా పేరుకు పోయిన సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్లలె ప్రగతి కార్యక్రమం ద్వారా నిధులు వెచ్చిస్తున్నట్లు దావ వసంత తెలిపారు. పలు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలోని శిథిలావస్థకు చేరిన గదులను పరిశీలించారు.ప్రజలు ఇచ్చిన ప్రతి వినతికి స్పందించి సమస్యల పరిష్కారాంతోపాటు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులను చేపడతానని పేర్కొన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

భూపతిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- అనర్హతవేటుపై హైకోర్టు తీర్పును సవాల్‌చేస్తూ సుప్రీంలో పిటీషన్
- హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోమన్న సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి7(ఆర్ఎన్ఎ) : మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అనర్హత వేటును సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును భూపతిరెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అయితే ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకోబోమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బొబ్డే స్పష్టం చేశారు. 2019లో ఎమ్మెల్సీ భూపతి రెడ్డిపై శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేసిన విషయం విదితమే. టీఆర్ఎస్ పార్టీ తరపున మండలికి ఎన్నికైన భూపతిరెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో భూపతిరెడ్డిపై నాటి చైర్మన్ అనర్హత వేటు వేశారు. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేసిన భూపతిరెడ్డికి అక్కడ చుక్కెదురైంది. చైర్మన్ ఆయనను అనర్హుడిగా ప్రకటించడాన్ని నాడు హైకోర్టు సమర్థించింది. అనర్హుడిగా ప్రకటించడంలో ఎలాంటి చట్టవిరుద్ధమైన అంశాలు తమకు కనిపించలేదని, రాజ్యాంగంలో షెడ్యూల్ 10లోని 8వ పేరా సమర్థనీయమేనని కోర్టు స్పష్టం చేసింది. శాసన మండలి అనర్హత నిబంధనల్లోని 7(4) రాజ్యాంగబద్ధమేనని పేర్కొన్న హైకోర్టు, భూపతిరెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు 8వ పేరా మౌలిక నిర్మాణ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందన్న వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. మండలి చైర్మన్‌కు అధికారం కల్పించే ఈ నిబంధన రాజ్యాంగ పరిధిలోనే ఉందని, ఇది చెల్లుబాటు అవుతుందని పేర్కొంది. అంతేకాదు తెలంగాణ శాసనమండలి అనర్హత నిబంధనల్లోని 7(4) రాజ్యాంగ విరుద్ధమనడానికి ఎలాంటి ఆధారాల్లేవని తెలిపింది. భూపతిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించడంలో ఎలాంటి చట్ట ఉల్లంఘనలూ లేవని, నిబంధనలకు లోబడే ఆయన నిర్ణయం తీసుకున్నారని వెల్లడించింది. భూపతిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేసింది హైకోర్టు. దీంతో హైకోర్టు తీర్పుపును సుప్రీంకోర్టు సమర్థించినట్లయింది.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కెసిఆర్ కసరత్తు

వివిధ పథకాలతో బలోపేతం అయిన అధికార పార్టీ

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో విపక్షాలకు అవకాశం లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కెసిఆర్ గట్టి దెబ్బనే కొట్టారు. దీంతో అన్ని పార్టీలు కలసినా ఇప్పుడు కెసిఆర్‌ను ఢీకొనడం సాధ్యం కాకపోవచ్చు. ముఖ్యమంత్రి కేసీఆర్ బలంగా ఉన్నారని రుజువయ్యింది. తెలంగాణలో అమలవుతున్న పథకాలతో దేశవ్యాప్తంగా ప్రచారం సాగుతోంది. దీంతో వచ్చే మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తదితర పార్టీలు కలసినా లాభం ఉండకపోవచ్చు. ఇదొక్కటే చాలు కెసిఆర్ రేపటి ఎన్నికలపై ధీమాగా ఉన్నారనడానికి. రైతుబంధు పథకాన్ని అమలు చేయడం ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశానికి మార్గనిర్దేశనం చేశారు. ఆయన దూరాభారం ఆలోచించి ఈ పథకం అమలు చేస్తున్నారని ఎవరిని అడిగినా చెబుతారు. కేవలం ఎన్నికల్లో ఓటుబ్యాంక్‌ను పదిలపర్చుకునే దిశగా ఈ పథకం బాగా ఉపయోగపడనుందని కూడా రుజువయ్యింది. వివిధ పథకాలు, 24గంటల విద్యుత్ తెలంగాణలో కెసిఆర్‌కు ఉన్న వ్యతిరేకత కూడా మటుమాయం అయ్యింది. తెలంగాణ ఏర్పడ్డ తరవాత బొటాబొటి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కెసిఆర్ ముందుగా తన స్థానాన్ని పదిల పర్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. అందులో భాగంగా ప్రతిపక్షాలను చీల్చి తాను బలపడటమే కాకుండా ప్రతిపక్షాలను బలహీనపరిచారు. ఇదంతా తెలంగాణ పునర్నిర్మాణంలో భాగమన్నారు. ఇది పార్టీల కలయికో లేదా విలీనంగానో చూడరాదన్నారు. ఇదంతా తెలంగాణ అభివృద్ధిలో భాగమని విశ్లేషించారు. ఆ తర్వాత వివిధ పథకాలకు రూపకల్పన చేయడం ద్వారా ప్రజాభిమానం చూరగొనే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగానే మిషన్ కాకతీయ,మిషన్ భగీరథ, 24గంటల కరెంట్,రైతుబంధు పథకం ప్రకటించడంతో పాటు విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో రైతులతో పాటు ప్రజల్లో కూడా భరోసా పెరిగింది. అవే మొన్నటి ఎన్నికల్లో టిఆర్ఎస్ మరింత బలోపేతం కావడానికి కారణమయ్యాయి. అయితే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వంటి పథకాలు అందరికీ అందకపోవడం వల్ల ప్రజలలో అసంతృప్తి ఉందన్న అంచనాలో విపక్ష పార్టీలో బోల్తాపడ్డాయి. గెలుపుగుర్రాలను ఎంపిక చేసే పనిలో ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల ప్రజలలో అనుకూలత ఉన్న నేతలను నిలుపుతారన్న ప్రచారం కూడా ఉంది. మున్సిపల్ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ కూడా పక్కా ప్లాన్‌తో విపక్షాలకు అందనంత దూరంలో ప్లాన్ వేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజార్టీ టిఆర్ఎస్ వెంటే ఉంటుందన్న ప్రచారం ఉంది.

సమగ్ర వ్యవసాయ విధానం రావాలి

అభూతకల్పనగా మారిన ఫ్రీ మార్కెట్
ఇబ్బడిముబ్బడి దిగుమతులతో నష్టం

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు.స్వాతంత్ర్యం లభించి 70సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. దీంతో సమస్య తాత్కాలిక ఉపశమనం కలిగిస్తోంది తప్ప సమస్యను శాశ్వతంగా దూరం చేయడం లేదు. ఇదే సమయంలో అప్పుల ఊబినుంచి బయటపడడానికి ఆత్మహత్యలను వీరు ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆయా రైతుల కుటుంబాలు మరింతగా ఊబిలో చిక్కుకుని పోతున్నాయి. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు సకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్డిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్ధంగా ఉంటున్నారు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటవండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అవసరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలి పోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్ట పోతున్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. రైతులను దోచుకుంటున్న వారికి తిండి ఎలా వంటబడుతుందో అర్థం కావడం లేదు. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. అంతెందుకు రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ కూడా తన వాగ్దానాన్ని నెరవేర్చుకోలేదు. తెలంగాణలో పరిస్థితిని మార్చేలా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నారు. రైతులకు పెట్టబడతో పాటు రాయితీ విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. అలాగే బీమా సౌకర్యం రాబోతున్నది. ఇకపోతే 24 గంటల ఉచిత కరెంట్ అందుతోంది. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు పెంచాలి. అంతేగాకుండా బలవంతంగా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ఇవన్నీ జాతీయస్థాయిలో జరగాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలుకూడా తెలంగాణ తరహాలో చొరవ తీసుకోవాలి. అప్పుడే మార్పు కనిపిస్తుంది. రైతులకు భరోసా దక్కి వ్యవసాయం ముందుకు సాగుతుంది. మనరైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్ల నడుపుతున్నారు. వ్యవసాయభూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి.

10నుంచి ఖాందేవ్ జాతర

ఆదిలాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): నార్నూర్‌లో జనవరి 10వ తేదీ నుంచి ఖాందేవ్ జాతర ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర అత్యంత వైభవంగా 15 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. 10 వ తేదీ శుక్రవారం రాత్రి 9.11 నిమిషాలకు మహాపూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారన్నారు. శనివారం ఉదయం 8.30 నిమిషాలకు తొడసం వంశీయుల ఆడపడుచు నువ్వల నూనే తాగే కార్యక్రమం ఉంటుందన్నారు. జాతరకు తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి తొడసం వంశీయులు వస్తారని తెలిపారు. నువ్వుల నూనె తాగే కార్యక్రమాన్ని తిలకించడానికి జిల్లా జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీ సోయం బాపురావ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎంపీపీ కనక వౌతుబాయి, పీఏసీఎస్ చైర్మన్ నాందేవ్‌కాంబ్లే, ఏఎంసీ చైర్మన్ రాథోడ్ వసంత్‌రావ్, వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్ ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

పల్లె ప్రగతితో మారనున్న గ్రామస్వరూపం

సర్పంచ్‌లు సేవాభావంతో ముందుకు సాగాలి: కొప్పుల

జగిత్యాల,జనవరి7(ఆర్ఎన్ఎ): రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గ్రామ సర్పంచ్‌లు సేవాభావం అలవర్చుకోవాలని అన్నారు. అందుకు అనుగుణంగా పల్లె ప్రగతిని పటిష్టంగా ముందుకు తీసుకుని వెళ్లాలని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి వివరించారు. పల్లెప్రగతి కార్యక్రమం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోందన్నారు. పలు గ్రామాల్లో ఆయన వైకుంఠధామాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డుకు శంకుస్థాపన చేశారు. స్థానికులకు తడి, పొడి చెత్త డబ్బాలు పంపిణీ చేశారు. నాళాల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. పల్లె ప్రగతిని విజయవంతం చేసేందకు కృషి చేస్తామని వారంతా స్పష్టం చేశారు. గ్రామాల సమగ్రాభివృద్ధికే ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని మంత్రి ఈశ్వ ర్ పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి, ప్లలెప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొదటి విడుత నిర్వహించినన కార్యక్రమంలో చాలా వరకు సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడంతోనే మొదటి విడత ప్రణాళిక సక్సెస్ అయిందనీ, అదే స్ఫూర్తితో రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో పాత పాడుబడ్డ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, తాగునీటి ట్యాంకులు తొలగించాలన్నారు. ప్రభుత్వ భవనాలకు ఒకే రంగు వేసి, ప్లలెప్ర గతి వాల్ పేయింటింగ్ వేయిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో ముఖ్యంగా పారిశుధ్య పనులు మమ్మురం చేయాలన్నారు.

జాగృతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వరంగల్,జనవరి7(ఆర్ఎన్ఎ): జాగృతి ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామీణ జిల్లా పరిధిలో ముగ్గుల పోటీలు, భోగి మంటల కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు జాగృతి జిల్లా నాయకులు చెప్పారు. మహిళల్లో సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో జాగృతి పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.. దీనిలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. పోటీల్లో పాల్గొని ప్రతిభకనబర్చిన వారికి బహుమతులు అందిస్తామని చెప్పారు.

టిఆర్ఎస్‌కు షాక్

-బిజెపిలో చేరిన కార్పోరేటర్ జయశ్రీ

కరీంనగర్,జనవరి7(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్‌లో అధికార పార్టీకి షాక్ తగిలింది. అధికార పార్టీకి చెందిన టీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ బిజెపిలో చేరారు. మంత్రి గంగుల కమాలకర్‌తో విబేధాల కారణంగా మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ సమక్షంలో జయశ్రీ కాషాయ కండువా కప్పుకున్నారు. పార్టీ కండువా కప్పిన బండి.. సాదరంగా ఆహ్వానించారు. గత ఎన్నికల్లో కరీంనగర్ 30వ డివిజన్ నుంచి టీఆరెస్ తరపున వేణు జయశ్రీ గెలిచారు. కాగా.. మునిసిపల్ ఎన్నికలకు ముందు జయశ్రీ టీఆర్ఎస్‌కు టాటా చెప్పేయడం పార్టీకి షాక్ తగిలినట్లేనని స్థానిక నేతలు చెబుతున్నారు. బీజేపీ తరపున ఈ ఎన్నికల్లో జయ శ్రీ పోటీ చేయబోతున్నారని తెలుస్తోంది.

మహిళలపై పెరుగుతున్న దాడులు

ప్రకటనలకే పరిమితంగా మహిళా సాధికారత
మహిళాబిల్లుతో భరోసా ఇవ్వని ప్రభుత్వం

న్యూఢిల్లీ,జనవరి7(ఆర్ఎన్ఎ): స్త్రీలు, విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోయింది. మహిళలపై దాడులను యథేచ్ఛగా కొనసాగిస్తూ, వారి హక్కులను కాలరాస్తూ, మహిళా సాధికారత సాధిస్తామనడం సరికాదు. భారతీయ సమాజం విలువలు కాపాడేలా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వారికి రాజకీయంగా హక్కుల కల్పనకు పోరాడాలి. ఎన్ని చట్టాలు చేసినా మృగాళ్ల మదోన్మాదం, కుటుంబ సభ్యుల కామ దాహం, అధికారులు, సహోద్యోగుల వికృత చేష్టలు వాళ్ల పాలిట శాపాలవుతున్నాయి. దీనికి తోడు మత ఛాందసవాదం మహిళా సమానత్వానికి మరింత హానికరంగా తయారైంది. భ్రూణ హత్యల కారణంగా దేశంలో క్షీణిస్తున్న అమ్మాయిల నిష్పత్తి ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఏటా జరుపుకుంటున్నా, మహిళలకు సమానహక్కులు, వారికి ప్రాతినిధ్యం వంటి విషయాల్లో ఇంకా మనం వెనకబడే ఉన్నాం. వారిని ముందుకు వెళ్లకుండా వెన్నక్కి నెట్టేస్తూనే ఉన్నాం. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగదొక్కు తున్నారు. ఇలా వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారు అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందనడంలో సదేహం లేదు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వివక్షలపై స్పందించడం లేదు. త్వరలోనే మహిళల రిజర్వేషన్లపై ముందుకు సాగుతామన్న ఆకాంక్ష అలాగే ఉండిపోయింది. పాలనలో వారికి భాగస్వామ్యం కల్పించకుండా వారిని అణగదొక్కే కుట్రల్లో బిజెపి కూడా ముందే ఉంది. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. చట్టసభల్లో మూడోవంతు రిజర్వేషన్లు ఎవరి దయాధర్మంగానో కాకుండా హుక్కుగా, సగౌరవంగా లభించాల్సి ఉంది. మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్య పడుతుంది. ఏకాభిప్రాయ సాధన, ఉపకోటా పేరిట ఇంతకాలం రాజకీయం చేస్తూ వచ్చారు. మహిళల హక్కుల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోకుండా చూడాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికారపక్షమే కాదు ప్రతిఎక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. ప్రభుత్వాలు ఏకపక్ష ధోరణితో మహిళలను విభజించి పాలించే తీరు పక్కన పెట్టకుంటే అది ఎంత మాత్రం సాధికారత సాధనకు ఉపయోగపడదు. మహిళా సాధికారత సంగతేమో వారి కనీస హక్కులు మృగ్యమయ్యాయి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత కూడా ప్రధాని మోడీ మహిళా బిల్లుపై నోరెత్తడం లేదు. విపక్షాలు కూడా దీనిని మరచి పోయాయి. వివిద చట్టాలు ఆమోదం పొందుతున్నా మహిళా బిల్లు మాత్రం ముందుకు కదలడం లేదు. సంపూర్ణ మెజార్టీ ఉన్నా మహిళా బిల్లుకు మాత్రం ఈ సమావేవాల్లోనూ మోక్షం దక్కడంలేదు. దీనిని గట్టెక్కించడంలో కనీసం ప్రస్తావన కూడా జరగలేదు. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత గట్టెక్కుతుందనుకున్న మహిళా బిల్లు దాదాపు అటకెక్కినట్లు గానే భావిస్తున్నారు. బిజెపి కూడా మహిళా బిల్లును తీసుకుని రాలేకపోయిందన్న భావన ప్రజల్లో ఏర్పడింది. మహిళా బిల్లును ఆమోదించకపోవడం బిజెపి ఘోర వైఫల్యంగానే చూడాలి. ఎన్నో ఆదర్శాలు వల్లించిన మోడీ సర్కార్ ఈ విషయంలో ఘోర వైఫల్యాన్ని ప్రదర్శించారు. మోడీ మనసులో మహిళా బిల్లుకు సంబంధించిన ఆలోచనలు వెల్లడి కావడం లేదు. దీంతో గత ఐదేళ్లుగా ఇది కోల్డ్ స్టోరేజిని దాటి రావడం లేదు. ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో సగం శాతం మంది మహిళలు కోరకుంటున్న మహిళా బిల్లుపై స్పష్టం చేయడం లేదు. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా గత రెండు దశాబ్దాలుగా మహిళా బిల్లు మాత్రం గట్టెక్కలేకపోతోంది. లోక్‌సభలో సంపూర్ణ మెజార్టీ ఉన్నా మోడీ ప్రబుత్వం దీనిని ముందుకు తీసుకుని వచ్చే ప్రయత్నం చేయడం లేదు.వ్యక్తిత్వ హననం జరుగుతున్నా.. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళా భ్యుదయమే దేశాభ్యుదయం. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు.

చేపల ఉత్పత్తికి కలసి వస్తున్నకాలం

ప్రభుత్వ ప్రోత్సాహకాలతో మరింత ముందుకు

హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కెసిఆర్ సర్కార్ తీసుకున్న చర్యలతో ఇప్పుడు మత్స్యకారులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. చేపల చెరువులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయకపోయినా ఉన్న చెరువుల్లో చేపలసాగు కలసివస్తోంది. ఉమ్మడి ఎపిలో కోల్పోయిన ప్